క్లుప్తంగా

ఘనంగా సామూహిక సత్యవ్రతం

నాగాయలంక: వ్యాస జయంతి పర్వదినం పురస్కరించుకుని ప్రాచీనమైన శ్రీరుక్మిణీ శ్రీసత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవస్థానంలో గురువారం సామూహిక శ్రీసత్య నారాయణస్వామి వ్రతం, విశేష పూజలు జరిగాయి. దీవి వేణుగోపాల్ బ్రహ్మత్వంలో శాస్త్రోక్తంగా 20మందితో సామూహిక వ్రతం చేశారు. తొలుత ధర్మకర్త విశాలక్షి పర్యవేక్షణలో సత్యప్రసాద్ అర్చకత్వంలో శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి మూల విరాట్‌లకు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భగవద్గీత, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం జరిగాయి.

నిత్యాన్నదానానికి విరాళం

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో నిర్వహించే నిత్యన్నదాన పథకానికి విజయవాడ డెయిరీ ఆఫీసర్స్ కాలనీకి చెందిన కంచర్ల కనకారావు రూ. 50,116 విరాళంగా ఇచ్చారు. గురువారం స్వామివార్లను దర్శించుకున్న అనంతరం ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు ఈ విరాళాన్ని అందజేశారు. దాత కుటుంబ సభ్యులను ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆలయ అధికారులు, దాత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 11వ తేదీ శుక్రవారం విద్యుత్ లైన్ల నిర్వహణ కారణంగా కరెంట్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.గోవిందరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చిలకలపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సర్కారుతోటలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా ఆ రోజు ఉదయం 8 నుంచి 11 గంటల వరకు సర్కార్ తోట, కొబ్బరితోట, చిలకలపూడి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఈడేపల్లి, శ్రీనివాస్‌నగర్ కాలనీ, ఆనందపేట, మాచవరం, డి మార్ట్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో విద్యుత్ ఉండదని తెలిపారు.

పాఠశాలకు కంప్యూటర్ బహూకరణ

భావదేవరపల్లి(నాగాయలంక): భావదేవరపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(పీటీఎం 2.0)లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రామస్తుడు భోగాది అప్పారావు కుమార్తె ఝాన్సీరాణి, మనుమడు వంశీధర్ రూ.లక్ష విలువైన కంప్యూటర్ బహూకరించగా ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ మండలి ఉదయభాస్కర్ ఎంఈఓలు రామదాసు, రామారావు పాల్గొన్నారు. తలగడదీవి హైస్కూలులో జరిగిన పీటీఎం 2.0 లో పాఠశాల పూర్వ విద్యార్థులు భోగాది వెంకట అప్పారావు, పద్మలత దంపతులు పది టాపర్ విద్యార్థులకు రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు.

నేడు ఎంఎంసీ కౌన్సిల్ సమావేశం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పాలకవర్గ సమావేశం ఈ నెల 11వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మేయర్ చిటికిన వెంటేశ్వరమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అజెండాలో పొందుపర్చిన 5 అంశాలపై చర్చించి తీర్మానం చేస్తారని పేర్కొన్నారు.

వరి నారుమళ్లు, చెరకు పంటల పరిశీలన

వెంకటాపురం(మోపిదేవి): మోపిదేవి, వెంకటాపురం గ్రామాల్లో కేవీకే ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ వరి నారుమడుల్లో ఇనుము, జింకు ధాతు లోపాలు అధికంగా ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. జింకు ధాతు లోప నివారణకు లీటరు నీటికి 2 గ్రాముల జింక్ సల్ఫేట్‌ను పిచికారీ చేసుకోవాలని, ఇనుము ధాతు లోప నివారణకు లీటరు నీటికి 20 గ్రాముల అన్నభేదీ, 2 గ్రాముల నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారి చేయాలని రైతులకు సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ రేవతి, రైతులు పాల్గొన్నారు.

బియ్యం అక్రమ రవాణాదారుడిపై సస్పెక్ట్ షీట్

అవనిగడ్డ: బియ్యం అక్రమ రవాణాని పట్టుకున్న విషయమై బెదిరించిన కామిరెడ్డి వినయ్‌కుమార్‌పై అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్, బైండోవర్ ఓపెన్ చేసినట్లు డీఎస్పీ టి.విద్యశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ గంగాధర్ ఆదేశాల మేరకు అవనిగడ్డ సబ్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఇసుక, పేకాట, బియ్యం అక్రమ రవాణాపై దాడులు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఇటీవల అక్రమ రేషన్ బియ్యాన్ని పట్టుకోగా అవనిగడ్డ 9వ వార్డుకు చెందిన కామిరెడ్డి వినయ్‌కుమార్ అలియాస్ నాని పోలీసులకు ఫోన్ చేసి బెదిరింపులు, దూషణలకు పాల్పడిన విషయాన్ని డీఎస్పీ విద్యశ్రీ ఇటీవల వెల్లడించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వినయ్ కుమార్‌పై విచారణ చేయగా గతంలో కూడా ఆయన రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసిన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇతనిపై గతంలో కేసులు నమోదు అయ్యాయి. ఇలాంటి చర్యలకు పాల్పడకుండా వినయ్‌కుమార్‌పై సస్పెక్టెడ్ షీట్, బైండోవర్ ఓపెన్ చేసినట్టు డిఎస్పీ చెప్పారు.

సగం రోడ్డుతో సరి!

- అవనిగడ్డ – నాగాయలంక బైపాస్ రోడ్డు
- 2.4 కి.మీలకు 1.4 కి.మీ రోడ్డు మాత్రమే నిర్మాణం
- సగం రోడ్డుతో ప్రయోజనం ఉండదంటున్న వాహనచోదకులు
- పూర్తిస్థాయి రహదారి నిర్మిస్తేనే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం



సగం మేర జరుగుతున్న అవనిగడ్డ, నాగాయలంక బైపాస్ రహదారి పనులు

అవనిగడ్డ: అవనిగడ్డ, నాగాయలంక బైపాస్ (పంటకాలువ) రోడ్డులో సగం రహదారి మాత్రమే నిర్మించడంపై వాహనచోదకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అవనిగడ్డలో ట్రాఫిక్‌ను తగ్గించేందుకు ఎనిమిదేళ్ల క్రితం రూ. 1.20 కోట్లు మంజూరు చేశారు. అప్పట్లో కొంతమేర బీటీ రహదారి వేశారు. బందలాయిచెరువు వద్ద రహదారికి అడ్డుగా ఇళ్లు ఉండటంతో కొంతమేర రహదారి పనులు జరగలేదు. అప్పుడు కూడా ప్రస్తుత శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇళ్ల తొలగింపు ప్రక్రియ జాప్యం కావడంతో ఈ రహదారి పనులు ముందుకు సాగలేదు.

ఎనిమిదేళ్ల క్రితమే..

అవనిగడ్డ నుంచి నాగాయలంకకు పది కిలోమీటర్ల దూరం ఉంది. మధ్యలో ఉన్న పలు గ్రామాలతో పాటు నాగాయలంక మండలంలోని గ్రామాల నుంచి నియోజకవర్గ కేంద్రమైన అవనిగడ్డకు రోజూ కొన్ని వందల వాహనాల్లో ప్రజలు ప్రయాణిస్తుంటారు. అవనిగడ్డ – బందలాయిచెరువుకు ప్రధాన రహదారిపై వెళ్తే 4.50 కి.మీ దూరం వస్తుంది. అదే అవనిగడ్డ నుంచి పంటకాలువ దారిలో వెళితే 2.8 కి.మీ దూరమే ఉంది. అంటే ఈ రహదారిపై వెళితే అవనిగడ్డ – నాగాయలంక మధ్య ఉన్న గ్రామాల ప్రజలకు 1.7 కి.మీ దూరం తగ్గుతుంది. ఈ రహదారి నిర్మాణం జరిగితే ప్రధానంగా ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుంది.



మిగిలిన సగం రహదారి

సగం రోడ్డుతో ఉపయోగమేంటి!

అవనిగడ్డ ఆర్టీసీ డిపో నుంచి నేరెళ్లపాలెం వంతెన వరకూ ప్రస్తుతం 1.04 కి.మీ మేర సగం రహదారినే నిర్మిస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.76 లక్షలతో ఈ రహదారి నిర్మాణానికి స్థానిక శాసనసభ్యుడు మండలి బుద్ధప్రసాద్ గురువారం శంకుస్థాపన చేశారు. గత మూడు రోజుల నుంచి ఈ రహదారిపై మెటీరియల్‌తో మెరక పనులు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో కాకుండా సగం రహదారి నిర్మించడంతో ప్రయోజనం ఏమిటని పలువురు వాహనదారులు అంటున్నారు. మిగిలిన రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఉద్యోగంతోపాటు సామాజిక సేవ



ఘంటసాల తహసీల్దార్ విజయప్రసాద్‌ను సత్కరిస్తున్న ప్రజా సంఘాల నేతలు, రెవెన్యూ ఉద్యోగులు

ఘంటసాల: ఉద్యోగంతో పాటు సామాజిక సేవలు అందిస్తున్న ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ సేవలు ఆదర్శనీయమని ప్రజా సంఘాల నేతలు తెలిపారు. ఏపీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి కృష్ణాజిల్లా తరఫున అత్యధిక నిధులు సమీకరించగా బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదగా ఘంటసాల తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల నేతలు, రెవెన్యూ ఉద్యోగుల ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ ప్రసాద్‌కు సన్మాన కార్యక్రమం డీఆర్‌ఓ సీసీ తూము వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు మునిపల్లి బుజ్జి, దాసి సీతారామరాజు, బుల్లా కిషోర్, దిరిశం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

నాగాయలంక: ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడానికి చర్యలు చేపట్టినట్లు ఎస్.ఐ కలిదిండి రాజేష్ గురువారం చెప్పారు. నాగాయలంకలోని ప్రధాన బ్యాంకుల్లో సైబర్ క్రైమ్ అవగాహన బ్యానర్లు, పోస్టర్లను గోడలపై అంటించినట్లు ఆయన తెలిపారు. ఫోన్‌కాల్స్‌తో వ్యక్తిగత సమాచారం దొంగిలింపు, ఫేక్ యాప్స్, డేటా ఫిషింగ్, క్యూఆర్ కోడ్ స్కామ్‌లు, ఒంటరి మహిళలను టార్గెట్ చేసే మోసాలపై ప్రజలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా హెచ్చరించారు. అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతాలు, ఓటీపీ, డెబిట్ కార్డుల వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని బ్యాంకుల వద్ద ఏర్పాటు చేసిన పోస్టర్‌లలో నిర్దేశించామన్నారు. ఇలాంటి మోసాలపై ట్రోల్ ఫ్రీ 1900కు ఫిర్యాదు చేయాలని ఎస్.ఐ సూచించారు.

అమ్మవారికి ఆషాఢ సారె సమర్పణ



చల్లపల్లి శ్రీసంపటాలమ్మకు సారె సమర్పిస్తున్న మహిళలు



పెదకళ్లేపల్లి దేవస్థానంలో మహిళలను ఆహ్వానిస్తున్న డీసీ శ్రీరామ ప్రసాదరావు

చల్లపల్లి: చల్లపల్లిలోని శ్రీసంపటాలమ్మ, శ్రీఅంకమ్మతల్లికి గురువారం మహిళలు సామూహికంగా వెళ్లి ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సారె సమర్పించారు. అగ్రహారం, నారాయణరావునగర్‌కు చెందిన మహిళలు కూడా బృందాలుగా సారె ఇచ్చారు.

బంటుమిల్లి: పెదతుమ్మిడిలోని పార్వతి సమేత అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ మట్టా విజయలక్ష్మి దంపతులు భక్తులు సారె సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మట్టా నాగబాబు, ట్రస్టీ జల్లూరి శరభయ్యగుప్త తదితరులు పాల్గొన్నారు.

పెదకళ్లేపల్లి(మోపిదేవి): పెదకళ్లేపల్లి గంగానమ్మ అమ్మవారికి ఆషాఢ సారెను గురువారం మహిళలు సమర్పించుకున్నారు. దుర్గా, పార్వతీ సమేత నాగేశ్వరస్వామివారికి సారె సమర్పించిన అనంతరం ప్రధాన వీధుల్లోని గ్రామదేవతలు నాంచారమ్మవారు, తైలంవారి అంకమ్మ తల్లిని దర్శించుకుని ఆషాఢ సారెను అందజేశారు. అరజా జ్ఞాన చందరరావు, అరజా పవన్ కుమార్, అరజా బోసు పర్యవేక్షించారు. దుర్గానాగేశ్వరస్వామివారి ఆలయం వద్ద ఆలయ డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు, ఆలయ అధికారులు సాదరంగా మహిళలను ఆహ్వానించారు.

అవనిగడ్డ: స్థానిక లంకమ్మ అమ్మవారికి భక్తులు గురువారం సారె సమర్పించారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని యాసం లంకమ్మ ఇంటి వద్ద నుంచి లంకమ్మ అమ్మవారి ఆలయం వరకూ మేళ తాళాలతో మహిళలు ప్రదర్శనగా వెళ్ళి అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు.

వాహనాన్ని మరమ్మతులు చేసి ఇవ్వండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుని వాహనానికి మరమ్మతులు చేసి అప్పగించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు సందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయలలు గురువారం తీర్పు చెప్పారు. బంటుమిల్లి మండలం అర్తమూరు గ్రామానికి చెందిన భీమవరపు ప్రకాశరావు 2022 డిసెంబరు 22న మచిలీపట్నంలోని శ్రీ లక్ష్మీ మోటార్స్‌లో హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ ద్విచక్రవాహనాన్ని కొనుగోలు చేసి ఆ వాహనానికి 2025 మే 27వ తేదీ వరకు చెల్లుబాటు అయ్యే విధంగా టాటా ఏఐజీ ఇన్సూరెన్స్ కవరేజీ చేశారు. 2024 మార్చి 4వ తేదీన ప్రకాశరావు కుమారుడు అజయ్‌కుమార్ బండి నడుపుతుండగా యాక్సిడెంట్ జరిగింది. క్లయిమ్ కోసం ఇన్సూరెన్స్ కంపెనీని సంప్రదించగా ఆలస్యం చేశారు. ఎన్నిసార్లు తిరిగినా వాహనానికి ఎటువంటి ఇన్సూరెన్స్ ఇవ్వకపోవడంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. కమిషన్ సభ్యులు పూర్వాపరాలు పరిశీలించి వాహనదారుడికి పూర్తి మరమ్మతులు చేసి అప్పగించాలని, రూ. 25 వేలు మానసిక వేదన కలిగించినందుకు, రూ. 5 వేలు ఖర్చుల నిమిత్తం తీర్పు వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా అందజేయాలని ఇన్సూరెన్స్ కంపెనీని ఆదేశించారు.

ఘనంగా గురుపౌర్ణమి



పులిగడ్డ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



బందరులో జిల్లా కోర్టు సెంటర్‌లోని మహాసాయి మందిరం వద్ద భక్తుల రద్దీ

మచిలీపట్నంటౌన్: గురు పౌర్ణమి సందర్భంగా గురువారం నగరంలోని షిర్డీ సాయినాథుడి మందిరాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లోని సాయిబాబా విగ్రహాలకు పాలు, ఇతర ద్రవ్యాలతో అభిషేకాలు చేసి పలు రకాల పుష్పాలతో అలంకరించి అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఆలయ ప్రాంగణాలు సాయి నామస్మరణతో మార్మోగాయి. భజనలు చేశారు. భక్తులు బాబాకు పండ్లు, పూలు సమర్పించారు. భక్తులకు ఆలయ భక్త బృందాల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనలు జరిగాయి. రాత్రికి పల్లకీ ఉత్సవం జరిగింది. భాస్కరపురంలోని షిరిడీ సాయిబాబా మందిరానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. జిల్లా కోర్టు సెంటర్‌లోని మహాసాయి మందిరానికి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలిరాగా ఆ ప్రాంతం కోలాహలంగా మారింది. జిల్లా సర్వజన ఆస్పత్రి ప్రధాన ద్వారం, వెనుక ద్వారం వద్ద ఉన్న సాయిబాబా మందిరాలు, రాజుపేట, హౌసింగ్‌బోర్డ్, బచ్చుపేటల్లోని షిరిడీ సాయి మందిరాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు.

బంటుమిల్లి: బంటుమల్లి సాయిమందిరంలో సాయినాథుడికి అభిషేకాలు, పుష్పయాగం వైభవంగా నిర్వహించారు అనంతరం ప్రధాన మూర్తికి పంచ సూక్తములు(రుద్ర, పురుష, శ్రీ, మన్యు, దుర్గ)లతో పంచామృతాభిషేకాలు నిర్వహించారు.

చల్లపల్లి: పురిటిగడ్డలోని శ్రీకృష్ణసాయి ధ్యాన మందిరంలో, స్థానిక మసీదు వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో బాబాకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుద్ధవిహార్‌లోని గౌతమ బుద్ధునికి ప్రత్యేక పూజలు చేశారు. పాగోలులో ఉన్న శ్రీకొవల్యాశ్రమంలోని అచలేశ్వరస్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు దంపతులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.


కృత్తివెన్ను: కృత్తివెన్ను బాబావారి మందిరం వద్ద భారీ అన్నదానం కార్యక్రమం జరిగింది.

వక్కపట్లవారిపాలెం(నాగాయలంక): వక్కపట్లవారిపాలెం గ్రామంలోని షిర్డీ సాయి సేవాశ్రమం(రిజిష్టర్డ్ ట్రస్ట్)ఆధ్వర్యంలోని సాయిబాబా మందిరంలో ఆలయ నిర్మాణకర్త, సాయిపురోహిత్ పద్యాల పద్మావతి నేతృత్వంలో పలు ఆధ్యాత్మిక పూజలు జరిగాయి. అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే అంబటి శ్రీహరిప్రసాద్(హరిబాబు) సాయిబాబాను దర్శించుకుని పూజ జరిపారు. భావదేవరపల్లిలోని షిర్డీసాయిబాబా సత్సంగ మందిరంలో జరిగిన వేడుకల్లో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ పాల్గొని సమాజంలో గురువు పాత్ర సమున్నతమైనదని పేర్కొన్నారు. నాగాయలంకలోని సాయిబాబా దివ్యజ్ఞాన మందిరంలో సాయి భక్తులు కిటకిటలాడారు. ఆలయ చైర్మన్ వర్రే సుమన్, రాచంశెట్టి పాపారావు తదితరులు పాల్గొన్నారు. తలగడదీవి, నంగేగడ్డ సాయిబాబా ఆలయాల్లో వేడుకలు ఘనంగా జరిగాయి.

మోపిదేవి: మనిషిని మనిషిగా ప్రేమించడమే సాయి పూజ, అదే దైవత్వమని సాయిసేవక్ నాగపోతరావు అన్నారు. మోపిదేవి కెనరా బ్యాంకు వెనుక గురుపూజోత్సవ వేడుకలు గురువారం వైభవంగా నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి దంపతులు, ఎస్ఐ సత్యనారాయణ, విశ్రాంతి ఎంఈవో శ్రీనివాసరావు, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. సాయిసేవక్ ఎస్ శివబాబు ఆధ్వర్యంలో సుమారు 2 వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిగింది.

అవనిగడ్డ: పులిగడ్డ సాయిబాబా ఆలయం, కొత్తపేట రోడ్డులోని షిర్డీ దివ్య మందిరం, బందలాయిచెరువు సాయి జ్ఞానమందిరంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బందలాయిచెరువులో ఆలయ నిర్వాహకురాలు సింహాద్రి లక్ష్మి ఆధ్వర్యాన భక్తులకు అన్నసమారాధన చేశారు.

ఘంటసాలలో...



ఘంటసాల బుద్ధ విహార్ ప్రాంగణంలో..

ఘంటసాల: బుద్ధ భగవానుని ధర్మ చక్ర ప్రవర్తన సూత్రాలు పాటించి శాంతియుతమైన జీవనం సాగించవచ్చని భంతే ధమ్మ ధజ థెరో అన్నారు. ఘంటసాల మ్యూజియం రోడ్డులోని సద్ధమ్మ దీపికా చారిటబుల్ ట్రస్టు అమరావతి బుద్ధ విహార్‌లో భంతే ధమ్మ ధజ థెరో ఆధ్వర్యంలో గురు పూర్ణిమ వేడుకలు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ఘంటసాల ఐటీఐ కాలేజ్ లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు అవనిగడ్డలో 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

- పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నానితో పాటు జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తలు హాజరు
- మాజీ ఎమ్మెల్యే సింహాద్రి



అవనిగడ్డ: చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుకు తెస్తూ శుక్రవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చెప్పారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం సాయంత్రం జరిగే కార్యక్రమానికి పార్టీ జిల్లా అధ్యక్షుడు పేర్ని నాని, పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి జట్టి గురునాథం, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పామర్రు, పెడన, పెనమలూరు, మచిలీపట్నం నియోజకవర్గాల సమన్వయకర్తలు కైలే అనిల్‌కుమార్, ఉప్పాల హారిక, దేవభక్తుని చక్రవర్తి, పేర్ని కిట్టు పాల్గొంటారని చెప్పారు. నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని సింహాద్రి కోరారు.

జయహో శాకంబరీ..



కూరగాయలు, పండ్లతో దుర్గాదేవికి అలంకరణ



భావదేవరపల్లి ఆదిలక్ష్మి దేవస్థానంలో..

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణకాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లి దుర్గానాగేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీ దుర్గమ్మను గురువారం శాకంబరీదేవిగా అలంకరించారు. చల్లపల్లి ఎస్టేట్ దేవాలయాల డెప్యూటీ కమిషనర్ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం నుంచి వేదపండిలతో ఆషాఢ సారె శ్రీ దుర్గా, పార్వతీ అమ్మవార్లకు సమర్పించారు. ఆలయ ప్రధానార్చకులు బుద్దు ప్రసాద్, విజయ్‌కుమార్ శర్మ బ్రహ్మత్వంలో అర్చకబృందం ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అధికారి చెన్న కేశవ, పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

పెడనలో అన్నసమారాధన

పెడన: గురుపౌర్ణమిని పురస్కరించుకుని పెడన పాతపేటలో వేంచేసి ఉన్న శ్రీముత్యాలమ్మ మఠం గుడివద్ద గురువారం భారీ అన్న సమారాధన నిర్వహించారు. అమ్మవారికి శాకంబరీదేవి అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని పెద్దూరు అచ్చిరెడ్డి గారి ముఠా ఆధ్వర్యంలో కొలువైయున్న శ్రీఆదిలక్ష్మి దేవస్థానంలో అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. ధర్మకర్త భోగాది విశ్వేశ్వరరావు, భోగాది శేషగిరిరావు సోదరుల ఆధ్వర్యంలో పూజలు చేశారు.

కృత్తివెన్ను: చెరుకుమిల్లి గ్రామంలో అన్నపూర్ణాదేవి సమేత ఓంకారేశ్వరస్వామివారి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిని శాకంబరీ దేవిగా అలంకరించారు.

అంతంత మాత్రంగానే పీటీఎం

ఎమ్మెల్యే సమావేశం జరుగుతుండగానే వెనుదిరిగిన తల్లులు



బీజీకే జెడ్పీహెచ్ఎస్‌లో మీటింగ్ జరుగుతుండగానే వెనుదిరిగిన పేరెంట్స్



పెదకళ్లేపల్లిలో నమస్కరిస్తున్న విద్యార్థులు

పెడన: మెగా పేరెంట్స్ సమావేశాలకు తల్లిదండ్రుల హాజరు అంతంత మాత్రంగానే ఉంది. పెడన బీజీకే జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులుంటే మెగా పేరెంట్స్ సమావేశానికి వంద మంది కూడా రాలేదని ఉపాధ్యాయులే పేర్కొవడం విశేషం. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, నాయకుల స్పీచ్, పూర్వ విద్యార్థుల సన్మానం, ప్రోగ్రెస్ కార్డులు అందజేత మినహా మరే కార్యక్రమం నిర్వహించలేదు. చేవేంద్ర జడ్పీహెచ్‌ఎస్‌లో పేరంట్స్‌కు ఆటల పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపల్ రామారావు పేరంట్స్‌తో మాట్లాడి మీ పిల్లలు ఇబ్బందులు, వారి సమస్యలు ఏమైనా ఉంటే నేరుగా పబ్లిక్‌గా తెలియజేయాలని కోరారు. ఆర్టీసీ బస్సు దిగి సుమారు 2 కిలోమీటర్లునడుచుకుంటూ కళాశాలకు రావాల్సి వస్తోందని పలువురు పేర్కొన్నారు. ఈ సమస్యపై చాలా మందిని కలిసి పరిస్థితిని తెలియజేశామని ప్రిన్సిపాల్ వారికి వివరణ ఇచ్చారు. ఆర్టీసీ చైర్మన్ నారాయణరావును కూడా కలిసి పరిస్థితిని లిఖితపూర్వకంగా తెలియజేస్తానని పేరెంట్స్‌కు, విద్యార్థులకు హామీ ఇచ్చారు. గత ఏడాది ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో నిలిచిన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి సన్మానించారు.

మచిలీపట్నంటౌన్: స్థానిక ఆర్‌కే జూనియర్ కళాశాలలో గురువారం టీచర్స్, పేరెంట్స్ మెగా 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ బండి రామకృష్ణ, కార్పొరేటర్ ఛాయాదేవి, కళాశాల ప్రిన్సిపాల్ శివరామకృష్ణ, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

అవనిగడ్డ: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో గురువారం పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కార్యక్రమం నిర్వహించారు. సమావేశాల్లో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ పాల్గొన్నారు.

మోపిదేవి: పెదకళ్లేపల్లి జెడ్పీ పాఠశాలలో ఉదయం విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, గ్రామ సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, అరజా సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల నుంచి స్పందన కరవు

బంటుమిల్లి: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం నిర్వహించిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశాలకు తల్లిదండ్రుల నుంచి స్పందన కరువైంది. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను 'సాక్షి' సందర్శించగా విద్యార్థు నమోదు దాదాపు 324 మంది ఉండగా తల్లిదండ్రులు కేవలం 50 మంది మాత్రమే పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీలో దాదాపు 176 మంది విద్యార్థులుండగా 30 మంది పేరెంట్స్ సమావేశానికి వచ్చారు. ప్రాథమిక మోడల్ పాఠశాలలో విద్యార్థులు దాదాపు 89 మంది ఉంటే 25 మంది మాత్రమే పాల్గొన్నారు. పలువురు తల్లిదండ్రులు ఆత్మీయ సమావేశాలపై అసంతృప్తిని వ్యక్తం చేయడం కనిపించింది. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

చేపలు, రొయ్యల చెరువులతో తాగు, సాగునీరు కలుషితం

ఘంటసాల: తాగు నీరు, సాగు నీరు కలుషితం అవడానికి కారణం అవుతున్న చేపలు, రొయ్యల చెరువులను అధికారులు ధ్వంసం చేసి సాగు భూములుగా మార్చాలని బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఘంటసాల నుంచి చిలకలపూడి వెళ్లే రోడ్డు వంతెనకు కుడివైపు ఉన్న లంక పొలాల్లో అనుమతుల్లేకుండా చేపలు, రొయ్యలు చెరువులు సాగు చేస్తున్నారని గ్రామానికి చెందిన రైతులు జి.నరసింహారావు, రవీంద్ర, తదితరులు సోమవారం మీ కోసంలో అర్జీ ఇచ్చారు. దీనిపై మత్స్యశాఖ జేడీ నాగరాజు గురువారం సాయంత్రం ఘంటసాల జలదీశ్వర స్వామి ఆలయం వద్ద రైతులతో మాట్లాడి ఆయా చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ లంక పొలాల్లో అనుమతుల్లేకుండా చేపలు, రొయ్యలు చెరువుల్లో ఉప్పు, రసాయన పదార్థాలు వేస్తున్నారని తెలిపారు. పక్కనే ఉన్న సారవంతమైన సుమారు 2 వేల ఎకరాల్లో భూమిల్లోని పంటల దిగుబడి తగ్గడమే కాక రెండో పంటైన మినుము పండక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాక ఆర్థికంగా నష్టపోతున్నామన్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా స్పందించడం లేదని తెలిపారు. స్పందించిన మత్స్యశాఖ జేడీ నాగరాజు ఆయా చెరువులను పరిశీలించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని రైతులకు తెలిపారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు శేఖర్, నరేంద్ర, రైతులు పాల్గొన్నారు.

పన్నుల వసూళ్లలో వేగం పెంచండి

పెడన: గ్రామాల్లో పన్నుల వసూళ్లు వేగవంతం చేయాలని ఎంపీడీవో ఎ. అరుణకుమారి ఆదేశించారు. గురువారం తన చాంబరులో పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ స్వర్ణ పంచాయతీ, పీఆర్ వన్ యాప్ యాక్టివిటీ, బంగారు కుటుంబాలు సమాచారం, పన్నులు, చెత్త సంపద కేంద్రాల నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. ఎప్పటికప్పుడు వీటిని పరిశీలిస్తూ అడుగులు వేయాలని, ఉన్నతాధికారులు నివేదికలు సమర్పించాలంటే తక్షణం స్పందించేలా ఉండాలన్నారు. సమావేశంలో డెప్యూటీ ఎంపీడీవో నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవో ఆఫీస్ ఏవోగా శివప్రసాద్

పెడన: ఎంపీడీవో కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా కేవీఎన్‌డీ శివప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ముందు విధులు నిర్వహించిన శిరీష పదవీ విరమణ చేయడంతో ఆ పోస్టు ఖాళీగా ఉంది. మచిలీపట్నం డ్వామా కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తున్న శివప్రసాద్ బదిలీపై పెడన ఏవో కార్యాలయానికి వచ్చారు.